# పాపులర్ రచనలు చేయటం ఎలా?

## యండమూరి వీరేంద్రనాథ్

(క్రిందటిసంచిక నుంచి తరువాయి)

*16. గొప్పరచన*

గొప్ప రచనల గురించి నేను చెప్పటం కన్నా దేవులపల్లి కృష్ణశాస్త్రి వ్రాసిన వ్యాసంలో కొంత భాగాన్ని ఇక్కడ ఇస్తున్నాను.

"ఇష్టమనో, మంచిదనో, గొప్పదనో... ఎవరి రచనల్లోంచి వారు ఏరి చెప్పటం కంటే ఇబ్బందయిన పని మరొకటి లేదు. కవి తన కష్టసుఖాలు తానే ఆప్యాయంగా ఆలాపించుకున్న కావ్యాల్నించి గొప్పది ఏరమంటే మరీ నలిగిపోతాడు. నీకిష్టమైన రచన ఏది? నీ మంచి రచన ఏది? నీ గొప్పరచన ఏది? అంటే చెప్పటానికి ఏ రచయితకైనా అహంకారమో, అభిమానమో అడ్డొస్తుంది.

ఇప్పటి కవులు చాలావరకూ సుదీర్ఘమైన మహాకావ్యాలు వ్రాయటం లేదు. ఎందుచేతనంటారు? ఇప్పటి కవికి అంత ఏకాగ్రత లేదు. అంత సాధకుడూ కాదు. తపస్సు తక్కువ ఇతనికి.

చాలామంది కవులు త్వరగా కావ్యరచన మానుకుంటారు! ఎందుచేత? ఒక్కొక్క మహాకవికి అంతరాంతరాల్లోనే ఒక గొప్ప రిజర్వాయర్, గంగాళమంత శక్తి ఉంటుంది. అది అయిపోయేటప్పటికి మళ్ళీ నింపుకుంటూ ఉండాలి. మళ్ళీ చార్జ్ చేసుకుంటూ ఉండాలి. మనచుట్టూ ఉన్న ప్రకృతి, ప్రజ మనకి నిర్వధికమైన రిజర్వాయరు, డైనమో. దాన్ని సరిగ్గా ఉపయోగించుకోకపోతే చల్లబడిపోవటమో, ఆరిపోవటమో జరుగుతూ ఉంటుంది. అనుభవం పట్ల అహంకారం చేతనో, లేక తను ఒక గదిలో చతికిలబడి ఆ అనుభూతినే గట్టిగా కౌగిలించుకుని కూర్చుంటే, అది కవి చేతుల్లోనే ఊపిరాడక నలిగిపోయి చచ్చిపోతుంది. క్రొత్త వేడి, కొత్త రుచి, క్రొత్త అనుభవం రావటానికి అన్నివైపుల్నుంచి మనం జీవనలోకంలో అవిశ్రాంతమో, అనవచితమో, అత్యంతాప్తమో అయిన సంబంధం పెట్టుకోవాలి.

ఇప్పటి ప్రపంచ పరిస్థితులు గొప్ప కావ్య సృష్టికి అనుకూలంగా ఉన్నాయా? లేవు - అని నాకు తోస్తుంది. ఆర్ద్రావేశం బావున్నప్పుడు వాల్మీకి రామాయణం వచ్చింది. మేధ నిశితంగా ఉన్నప్పుడు భారతం వచ్చింది. ఐహిక సుఖాలూ, సౌందర్యమూ అతిశయించినప్పుడు కాళిదాసు కావ్యాలొచ్చాయి. ఇప్పుడంతా తొందర తొందర యుగమై పోయింది. వ్రాయటానికి ఓపిక లేదు. చదవటానికి ఓపిక లేదు. ఇరవైఏళ్ళ క్రితం నేను వ్రాసినట్లుగా ఇప్పుడు వ్రాయలేను.

కోట్లమందితో రచయితకు సన్నిహిత సంబంధం ఉండాలి. అలాంటి సంబంధాలు ఈ మెకానిక్ జీవితంలో చాలా తక్కువయి పోయాయి. అందువల్లే మహాకావ్యాలు రావట్లేదు."

ప్రతీ వర్ధమాన రచయిత, పాపులర్ రచయిత చదవవలసిన పుస్తకం ఇది. "కవితా ప్రశస్తి". కృష్ణశాస్త్రిగారి వ్యాసావళిలో ఒక పుస్తకం ఇది. వీలైతే తప్పక చదవండి.

*17. రచనలు... విమర్శలు*

రచయితల మీద, రచనల మీద వచ్చే విమర్శల గురించి, ఇంతకుముందే ఈ వ్యాసావళిలో కొంతవరకు వ్రాయడం జరిగింది. విమర్శలని ఎంతవరకు పట్టించుకోవాలి, ఎప్పుడు ఎదుర్కోవాలి, ఎప్పుడు మౌనంగా ఉండాలి అనేది రచయిత యొక్క అనుభవం మీద, తార్కిక జ్ఞానం మీద ఆ ధారపడి ఉంటుంది. ఒక్కోసారి విమర్శలు రచయిత పాపులారిటీకి కూడా దోహదం చేస్తాయి. కొన్ని విమర్శలు

సూటిగా ఉండి ఇది నిజమే సుమా!, అనిపించేలా చేస్తాయి. ఆ విధమైన విమర్శలు వచ్చినప్పుడు రచయిత తన తప్పు సరిదిద్దుకోవటమో, తన పంథా మార్చుకోవటమో చేస్తూ ఉండాలి.

కొన్ని విమర్శలు మరీ పేలవంగానూ, అర్థరహితంగానూ ఉంటాయి. ఫలానా నవలలో హీరో, హీరోయిన్ని "నువ్వు" అంటే, హీరోయిన్, హీరోని "మీరు" అని ఎందుకనాలని ఒక పాఠకురాలు నాకు ఉత్తరం వ్రాసింది.

సాధారణంగా పత్రికలో సీరియల్ పడితే, పాఠకులు అందులో తప్పులు ఎత్తిచూపుతూ ఉత్తరాలు వ్రాస్తారు. అలాంటివాటికి జవాబు వ్రాయటం రచయిత బాధ్యత. కృతజ్ఞతలు చెపుతూ ఆ  తప్పు సరిదిద్దుకోవాలి.

ఏదయినా ఒక తప్పు పట్టుకుంటే పాఠకులకి చాలా సంతోషంగా ఉంటుంది. అటువంటప్పుడు కొంతమంది పాఠకులకి చాలా సంతోషంగా ఉంటుంది. అటువంటప్పుడు కొంతమంది పాఠకులు కొన్ని రకాలుగా స్పందిస్తారు. మరికొంతమంది ఆవేశంతో చెలరేగిపోయి, "నువ్వు ఫలానా తప్పు చేశావ్! ఇంత నిర్లక్ష్యంగా ఎలా వ్రాస్తున్నావు. కాస్త ఒళ్ళు దగ్గరుంచుకుని వ్రాయకూడదా?" లాంటి భాషను కూడా ప్రయోగిస్తూ ఉంటారు. తప్పు పట్టుకున్నాం, ఫలానా రచయిత తప్పుచేసాడు - అన్న ఆవేశమే వీళ్ళచేత ఇలాంటి భాషని ఉపయోగించేలా చేస్తుంది. వీటన్నిటికీ నమ్రతగా జవాబులివ్వటం మంచిది. ఎందుకంటే వారెటువంటి భాష ఉపయోగించినా తప్పు జరిగినమాట నిజమే కదా!

మరికొంతమంది పాఠకులు తప్పులే కాకుండా, రచయిత పోకడలో వచ్చిన మార్పు, అతడెన్నుకుంటున్న కథాంశాలపట్ల విమర్శ ఎత్తిచూపుతూ ఉంటారు. నాకు వచ్చే ఉత్తరాల్లో చాలా వరకూ "మీరు డబ్బుకోసం చాలా రచనలు చేశారు. అలా కాకుండా ఆనందో బ్రహ్మ, వెన్నెల్లో ఆడపిల్లలాంటి రచనలు చేయండి." అని సూచిస్తూ ఉంటారు. వీటిల్ని కూడా నిరంతరం పరిగణలోకి తీసుకుంటూ రచనలు చేయాలి. కానీ, ప్రతీ నవల ఒక ప్రేమలాగ ఆనందోబ్రహ్మలాగ వ్రాస్తే అసలు పాపులారిటీ పోయే ప్రమాదం కూడా ఉంది. క్లాస్‌కీ, మాస్‌కీ సరిపోయే రచనలు చేయగలిగిన వాడే అగ్రస్థానంలో ఉండగలడు.

మరికొంతమంది విమర్శకులుంటారు. వీరు ముందే నిర్ణయించుకున్న అభిప్రాయంతో రచనలు చదువుతుంటారు. ఫలానా నవల ఫలానా ఇంగ్లీష్ నవలకి కాపీకదా అని వ్రాస్తూ ఉంటారు. వారు ఆ  ఇంగ్లీష్ నవల చదవలేదు అన్నది రచయితకి అర్థమవుతుంది. ఇలాంటి విమర్శల్ని కూడా పట్టించుకోవటం అనవసరం.

సహేతుకమైన, సంపూర్ణమైన విమర్శ వస్తే, ఆ విమర్శకుడికి ప్రత్యుత్తరం వ్రాస్తూ కృతజ్ఞతలు చెప్పుకుంటే బావుంటుంది. నా విషయంలో అలాంటి మంచి మంచి విమర్శలు వచ్చినప్పుడల్లా, నేను వారికి నా పుస్తకాల్లో ఏదో ఒకదానిని కృతజ్ఞతగా పంపించటం చేస్తూ ఉంటాను.

మనం వ్రాసిందంతా మనకు గొప్పగానే కనబడుతుంది. కానీ బయటవారి దృష్టిలో దానిలో ఏదైనా లోపముననట్లయితే, అది మనకి సహేతుకంగా కనబడినట్లయితే దాన్ని ఒప్పుకోవడం మన అభివృద్ధికి చాలా దోహదపడుతుంది. పత్రికాముఖంగా ఏదయినా విమర్శ వచ్చినపుడు, ఆ విమర్శ రచయిత ప్రతిష్టని దిగజార్చేదిలా ఉంటే తప్పనిసరిగా దాన్ని ఎదుర్కోవాలి. చీల్చి చెండాడాలి. ఆ  విమర్శలో నిజం ఉన్నట్లయితే నమ్రతగా పెట్టుకోకూడదు. కొంతమంది రచయితలు, రచయిత్రులు ఎవరో ఒక పాఠకుడు వ్రాసిన ఒక వాక్యాన్ని పట్టుకుని పేజీలకు పేజీలు ఆ విమర్శని ఖండిస్తూ వ్రాసి, అదొక పెద్ద చర్చనీయాంశంగా లేవదీయటం మనం చూస్తూనే ఉంటాం. దీనివల్ల సమయం వృధా తప్ప ఏ విధమైన లాభమూ లేదు.

పాఠకుడికి పత్రికకి ఉత్తరం వ్రాయటం హాబీ అయితే అయిఉండొచ్చుగానీ, రచయిత వృత్తి మాత్రం రచనలు చేయటమే. అంతే తప్ప ఒక చిన్న విషయాన్ని పట్టుకుని సాగదీయటం కాదు.

## *18. రచనలు... సామాజిక స్పృహ*

ఇటీవల కాలంలో రచనల్లో సామాజిక స్పృహ ఉండటం లేదని చాలామంది విమర్శించటం గమనిస్తూనే ఉన్నాం. ఈ సామాజిక స్పృహ అంటే ఏమిటో, అదెలా ఉంటుందో చాలామందికి (నాతో సహా) తెలీదు. సమాజం అంటే వ్యక్తుల కలయిక. ఒక రచన చేస్తున్నప్పుడు పాఠకుడిలో అతడు జీవిస్తున్న విధానం పట్లగానీ, చుట్టూ ఉన్న వ్యక్తులతో సంబంధాలపట్లగానీ, అవగాహన కలిగిస్తే చాలు. అంతకనా గొప్ప సామాజిక స్పృహ ఏముంటుందో నాకు తెలీదు.

మంచి రచనలో సెక్స్, వయొలెన్స్ చోటు చేసుకోనవసరంలేదు. కానీ కేవలం సెక్స్, వయొలెన్స్ లేకపోవడం వల్లనే ఒక రచన మంచి రచన అవదు. ఈ విషయం చాలామంది మేధావులు గుర్తించటం లేదు. అందువల్లే మా పత్రికలో సెక్స్ వయొలెన్స్ లేదు అని సగర్వంగా ప్రకటించుకునే పత్రికలన్నీ మూతబడిపోతున్నాయి.

పాఠకుడి యొక్క అజ్ఞానం మీద ఆడుకోకుండా రచన చేయటం మంచిదే కానీ, అది చాలా కష్టం. సాహిత్యం పాడయిపోతోంది. అని విమర్శ చేసే చాలామంది వృద్ధ రచయితలు, రిటైర్ అయిన రచయితలు మొదలైనవారు - తాము మంచి రచనలు చేసి "ఇదిగో రచనంటే ఇలా ఉండాలి." అని చెప్పే కథలు గానీ, నవలలుగానీ వ్రాయకపోవటం దురదృష్టం.

మంచి రచన అంటే పాఠకుడి యొక్క మేధస్సు మీద ప్రభావం చూపించాలి గానీ, అతడి యొక మూడ్ మీద కాదు - అని ఒక వాదన ఉంది. ఈ వాదన కొంతవరకూ నిజమే. కానీ, మూడ్ మీద ప్రభావం చూపిస్తూ, పాఠకుడిని తన గ్రిప్‌లోకి తీసుకుని,అప్పుడు అతని మేధస్సుని ప్రభావితం చేయొచ్చు అన్న ఆలోచన ఈ సామాజిక స్పృహని కాన్వాస్ చేసేవారికి ఎందుకు తట్టదో అర్థం కాదు. ఒక పాపులర్ రచన కూడా మచి రచన అవచ్చు. చాలామంది విమర్శకులు మంచి రచన వేరు, పాపులర్ రచన వేరు అని భావిస్తూ ఉంటారు. ఈ వాదనలో అర్థం లేదనిపిస్తుంది.

ఒక పాపులర్ రచయిత తన జీవితకాలంలో ఒకటి రెండు మంచి రచనలు చేసి ఉండవచ్చు. కానీ మంచి రచయితగా ముద్రపడ్డ వాళ్ళెవ్వరూ పాపులర్ రచన చేసిన దాఖలాలు లేవు. సామాజిక స్పృహ ఉన్న రచయితగా ముద్రపడ్డ వాళ్ళెవరూ పాపులర్ రచన చేసి, "ఇదిగో మేమీ పాపులర్ రచన చేసి వేల వేల కాపీలు అమ్మాం. సర్క్యులేషన్ లక్షల్లో పెంచాం. కానీ, ఈ రచన మాకేమీ సంతృప్తి ఇవ్వలేదు. కాబట్టి ఇటువంటి రచన చేయకుండా మేం తిరిగి సామాజిక స్పృహ ఉన్న రచనలే చేస్తున్నాం." అని చెప్పిన రచనలు చరిత్రలో ఎక్కడాలేవు. ***చేయగలిగీ చేయకుండా ఉండటం వేరు. చేయలేక దానిగురించి విరక్తి పెంచుకోవటం వేరు.*** కాబట్టి ఇలాంటి విమర్శలని పాపులర్ రచయిత లెవరూ పెద్దగా పట్టించుకోరు. 'అంతర్ముఖం' నవల చదివి సి.నారాయణ రెడ్డిగారు, "ఈ నవల నువ్వు కాకుండా ఇంకెవరైనా వ్రాస్తే విమర్శకులు ఆకాశానికెత్తి ఉండేవారయ్యా" అన్నారు. ఇదంతా వ్రాస్తే ఈ అభిప్రాయంతో ఏకీభవించనివారు కూడా చాలామంది ఉండి ఉండవచ్చు. తాను చేస్తున్న పనిని సమర్థించుకోవటం కోసం ఇలా వ్రాస్తున్నాడు అనుకోవచ్చు. కానీ, ఎవరికయినాతన స్వంత అభిప్రాయాన్ని వెలిబుచ్చే అధికారం ఉందికదా!

సినిమా ఫీల్డ్‌లో కూడా ఇంతే. ఒక సినిమా తీసి ఫెయిలయిన దర్శకుడు "నేను చాలా గొప్పగా తీసాను. మిగతా దర్శకులలాగానే అర్థనగ్న దృశ్యాలు, ముద్దులు పెట్టలేదు. అందువల్లే నా చిత్రం ఫెయిలయింది" అంటాడు. అలా కాకుండా, ఒక సూపర్ హిట్ కమర్షియల్ మసాలా సినిమా తీసింతరువాత "నేనూ సినిమా తీయటం వల్ల ఎలాంటి సంతృప్తి పొందలేదు. అందువల్లే, కేవలం కళాఖండాలు మాత్రమే సృష్టిస్తున్నాను" అని చెప్పగలిగిన దర్శకుడు చాలా అరుదు.

విశ్వనాథ్‌గారు తీసిన 'అల్లుడు పట్టిన భరతం' లాంటి సినిమాలు ఆరకంగానే ఫెయిలయ్యాయి.

సాహిత్యం ఎలా ఉండాలి? అని కొన్ని పత్రికల్లో పాఠకుల నుంచి కొన్ని ఉత్తరాలు కూడా ఆహ్వానించటం చూస్తూనే ఉన్నాం. సాహిత్యం అంటే సమాజాన్ని ఉద్ధరించేదిలా ఉండాలని రకరకాల అభిప్రాయాలు పాఠకులు వ్రాస్తూ ఉంటారు. అయితే ఈ

పాఠకులెవరూ, నిజంగా ఎవరయినా ఒక రచయిత ఇలాంటి రచన చేస్తే "కొని" చదవరు. కొని చదవటమేనా రచయిత ముఖ్యఉద్దేశ్యం? అని మళ్ళీ ఇక్కడ విమర్శకులు ప్రశ్నించవచ్చు. ఈ వ్యాసావళి కేవలం 'పాపులర్ రచన చేయడం ఎలా' అనే విషయం మీదే వ్రాయబడుతోందని ఇక్కడ విమర్శకులు గ్రహించాలి.

ఇతరుల మనసులు కష్టపెట్టేలా మాట్లాడకూడదు. ఆత్మస్థైర్యంతో సమస్యలు ఎదుర్కోవాలి - భార్యా భర్తల మధ్య శృంగారపరమైన ఆహ్లాదకరమైన వాతావరణం ఉండాలి - కష్టపడటం ద్వారానే సుఖాలు అనుభవించవచ్చు. సామాజిక స్పృహలో ఇది కూడా ఒక భాగమే కదా?

కేవలం సెక్స్ వయొలెన్స్, థ్రిల్స్ ఉంటే, ఆ రచన తాత్కాలికంగా పాపులారిటీ పొందినా, చరిత్రలో నిలబడదు. పాఠకుల మనసు లోతుల్ని స్పృశించగలిగే పాయింట్ ఏదయినా ఉంటేనే అది నిలబడుతుంది. ఒక రచన సామాజిక స్పృహ ఉన్న రచనా? పాపులర్ రచనా? మంచి రచనా.. లేక చెత్త రచనా.. అన్నది కాలమే నిర్ణయిస్తుంది.

పాపులర్ రచన అనగానే అది సమాజానికి హాని చేస్తుంది. అన్న అభిప్రాయాన్ని పాఠకుల్లోకి ఇంజెక్ట్ చేయటానికి చాలామంది మేధావులు ప్రయత్నం చేస్తున్నారు. వీరిని మనం పట్టించుకోకపోవటమే మంచిది.

వచ్చే సంచికలో.. రచయిత బాధ్యత